

జూలో మరణ మృదంగం

ఇందిరా గాంధీ జూ పార్కులో జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ఒక్కొక్కటిగా సందర్శకులకు దూరమవుతున్నాయి. 8లో



రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. 8లో



యూపీఎస్సీ పరీక్షకు ఏర్పాట్లు

ఈ నెల 28న జరగనున్న యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జేసీ విశ్వనాథన్ చెప్పారు. 8లో

నగర వీధుల్లో విద్యుత్ వెలుగులు



బీచ్ రోడ్డులో విద్యుత్ కాంతులు

జీవీఎంసీ పరిధిలో ఇక నిరంతరాయంగా విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఒప్పందంతో జీవీఎంసీ ఖజానాపై భారీగా ఆర్థిక భారం పడడమే కాకుండా నిర్వహణ సంస్థ వైఫల్యాలతో నగర ప్రజలూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంతో జీవీఎంసీపై ఆర్థిక భారం తగ్గనుండటంతో పాటు రహదారులపై విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. ఏడేళ్లపాటు వీధి లైట్ల నిర్వహణను కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాజా నిర్ణయంతో జీవీఎంసీ ఖజానాపై సుమారు సగం మేర భారం తగ్గనుంది.

- **జీవీఎంసీ ఖజానాపై తగ్గిన భారం**
- **ఏడేళ్ల పాటు నిర్వహణకు ఒప్పందం**
- వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టు సంస్థకు ఆదేశం
- టీడీపీ హయాంలో ప్రతీ నెలా రూ.2.20 కోట్లు
- తాజా ఒప్పందంలో కేవలం రూ.1.18 కోట్లు మాత్రమే..
- రూ.85 కోట్లకుపైగా జీవీఎంసీ ఖజానాకు మిగులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

మహా విశాఖ నగర పరిధిలో స్ట్రీట్‌లైట్స్.. ఇక పక్కాగా వెలిగేందుకు అడుగులు పడుతున్నాయి. హుద్‌హుద్ సమయంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఒప్పందంతో ప్రతి నెలా రూ.2.20 కోట్లు వీధిదీపాల వెలుగుల కోసం జీవీఎంసీ చెల్లిస్తున్నా.. వ్యవస్థ మాత్రం అస్తవ్యస్తంగానే ఉంది. ఏడేళ్ల ఒప్పందానికి టీడీపీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ గడువు కాస్తా గత ఏడాది మార్చితోనే ముగిసింది. అయితే, తమకే అప్పగించాలంటూ పాత సంస్థ చేసిన ప్రయత్నాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. టెండర్ ద్వారా కొత్త సంస్థను ఎంపిక చేయడంతో పాటు గతంతో పోలిస్తే ఈ భారం కాస్తా రూ.1.18 కోట్లకు తగ్గిపోయింది. అంటే సుమారు సగం మేర భారం తగ్గింది. నెలకు రూ.1.02 కోట్ల మేర జీవీఎంసీకి భారం తగ్గనుంది. ఏడాదికి రూ.12.24 కోట్లు... ఏడేళ్లల్లో రూ.85.68 కోట్లు అవుతుంది. రానున్న ఏడేళ్ల కాలంలో మొత్తం రూ.85.68 కోట్ల మేర భారం జీవీఎంసీపై తగ్గనుంది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం చేసుకున్న ఒప్పంద ధర కంటే సగం ధరకే తాజాగా చేసుకుని నిర్వహణకు అప్పగించడం గమనార్హం. దీనిని గమనిస్తే వీధి దీపాల నిర్వహణలోనూ తెలుగుదేశం పార్టీ హయాంలో జీవీఎంసీ ఖజానాపై మోపిన భారం ఏ మేర ఉందో అర్థమవుతోంది.

నిర్వహణ అస్తవ్యస్తం : ఒప్పందం జరిగిన మొదటి ఏడాదిలో 92 వేల పాత బల్బుల స్థానంలో కొత్తగా ఎల్‌ఈడీ బల్బులను అమర్చారు. ప్రస్తుతం వీటి సంఖ్య 1.18 లక్షలకు చేరుకుంది. మనుషుల ప్రమేయం ఏమాత్రం లేకుండా నిర్దిష్ట వేళల్లో లైట్లను ఆన్, ఆఫ్ చేసేందుకు సెంట్రల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీసీఎంఎస్)అనే టెక్నాలజీని వినియోగించారు. అయితే, ఎల్‌ఈడీ లైట్లను పాత స్తంభాలకే అమర్చడం.. ఈ స్తంభాలు అనేక ప్రాంతాల వద్ద హైటెన్షన్ విద్యుత్ వైర్ల కింద ఉండటంతో బల్బులు త్వరగా పాడైపోయేవి. తొలినాళ్లలో వీధి లైట్లు వెలగట్లేదని ఫిర్యాదు వస్తే ప్రతీ 6 వేల దీపాలకు ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి... ఒకరిని ఇన్‌చార్జిని నియమించి ల్యాప్‌టాప్ అందించారు. ఆయన పరిధిలో ఎక్కడైనా సమస్య వస్తే 48 గంటల్లో పరిష్కరించేవారు. ఇదంతా కేవలం ఏడాదిన్నర పాటు సజావుగా సాగింది. ఆ తర్వాత షరా మామూలైపోయింది. నెలల తరబడి వీధులంతా చీకట్లో మునిగిపోయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. జీవీఎంసీ అధికారులు కాస్తా ఒప్పంద సంస్థను సంప్రదించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అమర్చిన బల్బుల నాణ్యతపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. గత టీడీపీ హయాంలో మోపిన భారాన్ని మొన్నటివరకూ జీవీఎంసీ భరించాల్సి వచ్చింది. ఒప్పందం గడువు ముగియడంతో వార్డుల వారీగా నిర్వహణను అప్పగించాలని మొదట్లో భావించారు. అయితే, తద్వారా నిర్వహణలో కొత్త సమస్యలు వస్తాయని భావించిన ప్రభుత్వం మొత్తంగా ఒకే గొడుగు కింద నిర్వహణ ఉంటే మంచి ఫలితం ఉంటుందని భావించడంతో పాటు గతంలో మోపిన భారాన్ని తగ్గించుకునే ప్రయత్నమూ చేసింది. మొత్తంగా నగర ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదుల లేకుండా వెంటనే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు సంస్థను జీవీఎంసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

జోన్ల వారీగా ఉన్న వీధి దీపాల సంఖ్య

జోన్	వీధి దీపాల సంఖ్య
జోన్-1	5,190
జోన్-2	17,919
జోన్-3	11,120
జోన్-4	9,567
జోన్-5	20,818
జోన్-6	24,763
జోన్-7	8,654
జోన్-8	19,969
మొత్తం	1,18,000

హుద్‌హుద్ సాకుగా...!

విశాఖ నగరాన్ని 2014 అక్టోబర్‌లో అతలాకుతలం చేసిన హుద్‌హుద్ తుఫాన్ సమయంలో వీచిన పెనుగాలులకు ప్రజలు చిరుగుటాకుల్లా వణికిపోయారు. భీకరమైన గాలులు నగరాన్ని ధ్వంసం చేసిన సమయంలో 30 వేల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. 75 వేలకు పైగా స్ట్రీట్ లైట్స్ ధ్వంసమయ్యాయి. ఈ సమయంలో స్ట్రీట్ లైట్స్‌లో ఎల్‌ఈడీ బల్బులు అమర్చాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.65.76 కోట్ల రుణంతో ఢిల్లీకి చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ ఏజెన్సీ (ఈఈఎస్‌ఎల్)తో జీవీఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది.

ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతతో పాటు రుణాన్ని నెలకు రూ.2.20 కోట్లు చెల్లించాలని ఒప్పందం జరిగింది. నగరమంతా ఒక లక్ష ఎల్‌ఈడీ లైట్లను అమర్చడంతో పాటు ఎక్కడైనా లైట్లు పాడయితే రెండు రోజుల్లోగా పాత వాటి స్థానంలో కొత్తవి అమర్చడం, వాటి నిర్వహణ, బిల్లుల చెల్లింపు మొదలైన బాధ్యతలను ఈఈఎస్‌ఎల్‌కు అప్పగించింది. 2015 మార్చి నుంచి ఒప్పందం అమల్లోకి రాగా ఏడళ్లపాటు ఒప్పందం కొనసాగుతోందని అగ్రిమెంట్ చేసుకున్నారు. దీనికోసం ఏజెన్సీకి ప్రతీనెలా రూ.2.2 కోట్లు జీవీఎంసీ చెల్లిస్తోంది. అంటే ఏడాదికి రూ.26.4 కోట్లు చొప్పున ఏడేళ్ల కాలానికి ఈఈఎస్‌ఎల్ సంస్థకు రూ.184.8 కోట్లను జీవీఎంసీ చెల్లించింది.

వీధి దీపాల సమస్యకు చెక్



జీవీఎంసీ పరిధిలో వీధి దీపాల సమస్య ఉండేది. గత ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఒప్పందంతో జీవీఎంసీపై అదనపు భారంతో పాటు నగర ప్రజలూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి సమస్య రాకుండా వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీధి దీపాలు సకాలంలో వెలగడంతో పాటు పోయిన వెంటనే కొత్తగా ఏర్పాటు చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కాంట్రాక్టు సంస్థకు స్పష్టంగా చెబుతున్నాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ



రావత్‌కు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆర్థికశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్.రావత్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు.

రేంజ్ నుంచి సిటీకి ముగ్గురు సీఐలు

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ రేంజ్ నుంచి ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను నగరానికి కేటాయించారు. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జి.దేముడుబాబు, బి.వి.జగన్నాథరాజు, బి.లూథర్ బాబు ఉన్నారు. వీరికి నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్ కల్పించనున్నారు.

12 మంది నర్సులకు పదోన్నతులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో 12 నర్సులకు హెడ్ నర్సులుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 12 మందికి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు ఆస్పత్రుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టెన్త్ మార్కుల జాబితాలో తప్పిదాల సవరణకు అవకాశం

విశాఖ విద్య: పదో తరగతి మార్కుల జాబితాలో తప్పిదాల సవరణకు ప్రభుత్వ ఎగ్జామినేషన్ బోర్డు డైరెక్టర్ అవకాశం కల్పించినట్లు డీఈవో ఎల్. చంద్రకళ బుధవారం తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులకు ఇప్పటికే షార్ట్ మెమోలను జారీ చేశామన్నారు. దీనిలో ఏమైనా తప్పిదాలు ఉన్నట్లుగా గుర్తించినట్‌లైతే, తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 20 నాటికి అందజేయాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జీవీఎంసీ ఆధ్వర్యంలో 124 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి , మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ పరిధిలో చలివేంద్రం, విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో మజ్జిగ అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వీలైనంత మేర పగటిపూట ఇంటివద్దనే గడపాలని, అత్యవసర పనులకు మాత్రమే బయటకు రావాలని కలెక్టర్ కోరారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ (టెక్నికల్) తెలిపారు. పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 660 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆపరేటర్, కస్టమర్ రిప్రజెంటేటివ్స్, ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ కేడ్, టెలి కాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఎఎస్ఎం, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్స్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీకామ్ (టాలీ), బీటెక్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించిన 18–40 సంవత్సరాల స్త్రీ,పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగం బట్టి జీతం నెలకు రూ10వేలు నుంచి రూ35,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్ నందు తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఏయూ ప్రగతి ప్రశంసనీయం

- నాడు–నేడులో మౌలిక వసతుల కల్పన భేష్
- విద్యార్థులకు ఉపయుక్తంగా ఇంక్యుబేషన్, స్టార్టప్‌లు
- ఉన్నత విద్యా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్యామలరావు



వర్సిటీ స్టార్టప్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు అన్నారు. బుధవారం ఉదయం ఆయన ఏయూలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా అన్ని కోర్సులను మార్పులు చేసిన విధానం బాగుందన్నారు. దీని ఫలితంగా 3,600 ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ఆర్ట్స్, సైన్స్ కళాశాలల విద్యార్థులు కూడా మెరుగైన ఉపాధి అవకాశాలు సాధించారన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లు, స్టార్టప్ కల్చర్‌ను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. స్టార్టప్ సెంటర్‌లో పనిచేస్తున్న యువతతో మాట్లాడి, వారు చేస్తున్న ఆవిష్కరణలు తెలుసుకున్నారు.

- నాడు–నేడు స్ఫూర్తితో వర్సిటీ భవనాల ఆధునికీకరణ చేపట్టారని, రాష్ట్రంలో పురాతన విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఏయూ నిలుస్తోందన్నారు. టైమ్స్–ది వీక్ హాన్స్ సర్వేలో అఖిల భారత స్థాయిలో 9వ స్థానం సాధించడంపై వీసీ ప్రసాద రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా వీసీ వర్సిటీలో జరుగుతున్న ప్రగతి పనులను ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావుకు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏయూలో ఆయన పర్యటన సాగింది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అధికారులు, డీన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ఏడాది జైలు శిక్ష

విశాఖ లీగల్ : బాలికను లైంగికంగా వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.60 వేల జరిమానా విధిస్తూ పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంటా సుమన్ (37) పెదగంట్యాడ ఏపీ హెచ్‌బీ కాలనీ ప్రాంత నివాసి. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు పనులు చేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో 2015 సెప్టెంబర్ 27న భార్య ఫంక్షన్‌కు వేరే ఊరు వెళ్లింది. దీంతో ఇంటిలో వంట చేసేందుకు సమీపంలోని బంధువుల బాలికను రమ్మన్నాడు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వంట చేస్తున్న బాలికపై సుమన్ లైగింక వేధింపులకు పాల్పడ్డాడు. బెదిరిపోయిన బాలిక ఇంటికి వెళ్లి తల్లికి చెప్పింది. వెంటనే ఆమె పెదగంట్యాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సుమన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో సుమన్‌కి ఏడాదిపాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే రూ.50 వేల జరిమానా ఫిర్యాదికి చెల్లించాలని, మరో రూ.10 వేలు జరిమానా కోర్టుకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

బాబు నోట మళ్లీ పాత పాట

- 2014 నాటి హామీయే వల్లె వేసిన చంద్రబాబు
- పంచగ్రామాల సమస్య పరిష్కరిస్తానని హామీ
- జనం రాకపోవడంతో అసహనం
- చప్పగా సాగిన పెందుర్తి సభ



వేపగుంటలో మాట్లాడుతున్న చంద్రబాబు

సింహాచలం: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నోట మళ్లీ అదే మాట.. 2014 ఎన్నికల సమయంలో పంచ గ్రామాల సమస్యను వంద రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు. బుధవారం నాటి పెందుర్తి సభలో కూడా మళ్లీ అదే హామీ ఇచ్చారు. 2014లో గెలిచిన తర్వాత అదే ఏడాది కేబినెట్ తొలి సమావేశం విశాఖలో పెట్టి పంచగ్రామాల సమస్యను ప్రధానాంశంగా చర్చించారు. ఆ తర్వాత సమస్యపై పట్టించుకోలేదు. నమ్మి ఓట్లు వేసిన పంచగ్రామాల ప్రజలకు మొండి చేయి చూపారు. పైగా ఐదేళ్ల పాలన ముగుస్తుండగా ఆగమేఘాలమీద 2019లో ప్రత్యేక చట్టం అంటూ జీవో 229 తీసుకొచ్చారు. ఆ జీవోలోని అంశాలను స్వయానా టీడీపీకే చెందిన సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజే వ్యతిరేకించారు. బుధవారం పెందుర్తిలో బహిరంగ సమావేశానికి వెళ్తూ వేపగుంట జంక్షన్‌లోను, పెందుర్తిలోనూ పంచగ్రామాల భూసమస్యపై చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తానని చెప్పుకొచ్చారు. వేపగుంట జంక్షన్ వద్ద జనం పలచగా ఉండటం, వచ్చిన వాళ్లలో చాలా మంది వెనుదిరగడంతో అసహనం వ్యక్తం చేశారు. వేపగుంటలో 93, 95వ వార్డు కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీను ఆధ్వర్యంలో చంద్రబాబుకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చంద్రబాబు చినముషిడివాడ కూడలి దాటిన తర్వాత ఓపెన్‌టాప్ వాహనంపై పెందుర్తి కూడలికి చేరుకున్నారు. బహిరంగ సభలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీను పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఈవెనింగ్ ఓపీ ప్రారంభం

- సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు వైద్య సేవలు
- రోగులకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు

మహారాణిపేట : పేదల పెద్దాస్పత్రి కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది. రోగులకు చెందిన వివిధ పరీక్షల రిపోర్ట్స్ అదే యూనిట్ వైద్యులు చూడడం ప్రధాన ఉద్దేశంగా ఈవెనింగ్ అవుట్ పేషెంట్ (ఓపీ) వైద్య సేవలకు బుధవారం శ్రీకారం చుట్టారు. తొలి విడతగా గైనిక్, డెర్మటాలజీ విభాగాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు ఓపీ నిర్వహించారు. రానున్న రోజుల్లో బ్రాడ్ స్పెషాలిటీస్ కిందకు వచ్చే మెడిసిన్, సర్జన్స్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ విభాగాల ఓపీ ప్రారంభిస్తామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు.

ఆరో విభాగాల్లో ఏర్పాట్లు : మొత్తం ఆరు విభాగాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు ఓపీ నిర్వహించడానికి కేజీహెచ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం ఏ ఓపీలు చూశారో సాయంత్రం కూడా అవే ఓపీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఇతర సిబ్బందిని నియమిస్తున్నారు. అవసరమైన వారి డ్యూటీల్లో మార్పులు చేస్తున్నారు. ఇటీవల అమరావతిలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో ఈవెనింగ్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచనపై చర్చ జరిగింది. ఈ ప్రకారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం బోధన ఆస్పత్రుల్లో ఈవెనింగ్ ఓపీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. కేజీహెచ్‌లో నిర్వహిస్తున్న ఈవెనింగ్ ఓపీలను సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

నేడు కేంద్రమంత్రి, మాజీ ఉపరాష్ట్రపతి రాక

మహారాణిపేట: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో సాయంత్రం 5.10 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి పాండురంగాపురంలో ఉన్న స్వర్గీయ ఐ.విష్ణురావు ఇంటికి వెళతారు. కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. రాత్రి 10. 30 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు,

మాజీ ఉపరాష్ట్రపతికూడా..

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గురువారం ఉదయం 11 గంటలకు వాల్తేరు క్లబ్‌లో ఐ.విష్ణురావు సంతాప సభకు హాజరవుతారు. రాత్రికి తిరిగి పోర్టు గెస్టు హౌస్‌కు చేరుకుంటారు. 20న ఉదయం 7.40 గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు.

టీచర్లకు తీపి కబురు!

- ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు గ్రీన్ సిగ్నల్
- అన్ని కేడర్ల వారికి దక్కనున్న ప్రమోషన్
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 200 మందికి అవకాశం
- హైస్కూల్, ప్లస్ టూ స్కూళ్లలో ఖాళీల భర్తీ
- ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల విడుదల
- సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలకు 19 వరకు గడువు



సబ్జెక్టు టీచర్ల సర్దుబాటుకు నిర్వహించిన కౌన్సెలింగ్ (ఫైల్)

విశాఖ విద్య: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బడులు తెరిచే నాటికి ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేలా డీఈవో కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్–2 హెచ్ఎం, అదే విధంగా ప్లస్2 స్కూళ్లలో పీజీటీలుగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఆయా కేడర్లకు చెందిన సుమారు 2 వందల మందికి పైగా ఉద్యోగోన్నతులు దక్కనున్నాయి. ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించేలా ఉన్నతస్థాయిలో కసరత్తు జరుగుతుండగా, మరో పక్క ప్రమోషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

తీరనున్న సబ్జెక్టు టీచర్ల కొరత

హైస్కూళ్లు, ప్లస్ టూ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా ఈ ఏడాది జనవరిలో 468 మంది ఉపాధ్యాయులను హైస్కూళ్లకు సర్దుబాటు చేశారు. తాజాగా చేపట్టబోయే ఉద్యోగోన్నతులకు వీరిని కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో పూర్తి స్థాయిలో ఖాళీలను భర్తీ చేసేలా ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ ప్రత్యేక దృష్టి సారించారు.

షెడ్యూల్ ఇలా:–

- హైస్కూల్ ప్లస్ స్కూళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన 71 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా అవకాశం కల్పించేందుకు ఇప్పటికే సీనియార్టీ జాబితాలను ప్రకటించారు. వీరికి ఈ నెల 19న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.
- సెకండరీ గ్రేట్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్, అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్–2 హెచ్ఎం (ప్రభుత్వ/జెడ్పీ) ప్రమోషన్‌కు బుధవారం సీనియార్టీ జాబితా విడుదల చేశారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువీకరణ పత్రాలతో ఉపాధ్యాయులు 18, 19 తేదీల్లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు తుది సీనియార్టీ జాబితా 20న ప్రకటిస్తారు. స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ వద్దనుకునే వారు 21, 22 తేదీల్లో డీఈవో కార్యాలయానికి రాతపూర్వకంగా తెలియజేయాలి. దీనికి సంబంధించిన ఏమైనా అభ్యంతరాలుంటే తగిన ధ్రువీకరణ పత్రాలతో డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి.

ఏర్పాట్లు చేస్తున్నాం




ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఉద్యోగోన్నతుల జాబితాలను సిద్ధం చేస్తున్నాం. షెడ్యూల్ మేరకు జాబితాలను ప్రకటించి, ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తాం. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అందరికీ ఆమోదకరమైన రీతిలో ముందుకెళ్తాం.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

కాచిగూడ ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్ వరకు పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 20వ తేదీ నుంచి మహబూబ్‌నగర్ వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ప్రతి రోజూ సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరే విశాఖపట్నం–కాచిగూడ (12861) ఎక్స్‌ప్రెస్ మరుసటిరోజు ఉదయం 6.45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.55 గంటలకు బయలుదేరి ఉదయం 9.20 గంటలకు మహబూబ్‌నగర్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో కాచిగూడ–విశాఖపట్నం(12868) ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్‌లో ప్రతి రోజూ సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరి, 6.10 గంటలకు కాచిగూడ వస్తుంది. అక్కడ నుంచి 6.20గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.50 గంటలకు విశాఖ పట్నం చేరుకుంటుంది.





ఆర్సీ, లైసెన్స్ కార్డుల ప్రింటింగ్‌లో జాప్యం

గోపాలపట్నం: ఆర్సీ, లైసెన్స్ కార్డుల పంపిణీ లేని కారణంగా.. వాటి ప్రింటింగ్ ఆగిపోయిందని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. 2021 డిసెంబర్ 10 వరకు ఆర్సీ కార్డులు, 2021 నవంబర్ 30 వరకు లైసెన్స్ కార్డులను స్పీడ్ పోస్టులో పంపించినట్లు చెప్పారు. కార్డులు స్టాక్ వచ్చిన తర్వాత మిగిలిన వాటిని ప్రింట్ చేసి స్పీడ్ పోస్టులో పంపిస్తామని వెల్లడించారు. అప్పటి వరకు https:// aprtacitizen. epragathi. org ను సందర్శించి ఫారం 6, ఫారం 23ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వాటిని అధికారిక పత్రాలుగా వాడుకోవచ్చని సూచించారు. పోలీసులు, రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో డిజిటల్ రూపంలో ఉన్న పత్రాలను చూపించవచ్చన్నారు.

జూలో మరణ మృదంగం

- రెండు నెలల్లో మూడు జంతువుల మృతి
- ఇవన్నీ ఆడ జంతువులే కావడం బాధాకరం
- ఎన్‌క్లోజర్లలో ఒంటరిగా జిరాఫీ, జీబ్రా

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ఇక్కడ లేని అరుదైన జంతువులను విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో జూ పార్కుల నుంచి తీసుకొచ్చినా వాటి సంతతి పెరగడం లేదు కదా.. ఒక్కొక్కటిగా సందర్శకులకు దూరమవుతున్నాయి. రెండు నెలల వ్యవధిలో జీబ్రా, తెల్ల పులి, జిరాఫీ మృతి చెందడం బాధాకరం. ఇవన్నీ ఆడ జంతువులే. దీంతో వాటి సంతతి వృద్ధి చెందే అవకాశం లేకుండా పోయింది. జీబ్రా, తెల్ల పులి, జిరాఫీ జూకు రాక ముందు వాటి జాడ లేదు. జతలుగా ఇక్కడకు వచ్చిన ఆయా జంతువులు ప్రస్తుతం ఒంటరయ్యాయి.

వైద్య సేవలు అందకేనా.?

జూలో పూర్తిస్థాయి ఆస్పత్రి ఉంది. ఇన్‌పేషెంట్ వార్డు కూడా నిర్మించారు. అనారోగ్యానికి గురయ్యే వన్య ప్రాణులను ఇక్కడ ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స ఉందించే వీలుంది. ఇక్కడ సీనియర్ వైద్యుడు, అసిస్టెంట్‌తో పాటు సహాయకులు ఉన్నారు. అయినా వైద్య సేవలు సరిగా అందకపోవడం వల్లే వన్యప్రాణులు తరచూ మృత్యువాత పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలో మూడు జంతువులు చనిపోవడంపై సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కులోని జంతువులు, పక్షులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

గైనిక్ సమస్యతో...

మలేషియా దేశంలోని నెగ్రా జూ పార్కు నుంచి 2013లో అప్పటి జూ క్యూరేటర్ రామలింగం ఓ జత జిరాఫీలను ఇక్కడకు తీసుకొచ్చారు. మలేషియా నుంచి ఓడలో మూడు జిరాఫీలను చెన్నై పోర్టుకు తీసుకొస్తుండగా.. వాటిలో మగ జిరాఫీ సముద్ర మార్గ మధ్యలోనే మృతి చెందింది. మిగిలిన జిరాఫీలు విశాఖ జూ పార్కుకు చేరాయి. అప్పటికి మగ జిరాఫీ(బేకన్) వయసు ఏడాదిన్నర కాగా.. ఆడ జిరాఫీ(మే)కి నాలుగు నెలలే.. అవి జూలోనే పెరిగి పెద్దయ్యాయి. ఈ క్రమంలో జిరాఫీల సంఖ్యను వృద్ధి చేయాలనే ఆలోచనతో 2019లో అప్పటి క్యూరేటర్ యశోదబాయి వాటి పునరుత్పత్తికి బాటలు వేశారు. ఈ నేపథ్యంలో గర్భం దాల్చిన ఆడ జిరాఫీకి పుట్టిన పిల్ల 12 రోజుల్లో మృతి చెందింది. మరోసారి 2020లో కూడా గర్భం దాల్చిన ఆ జిరాఫీ కడుపు లోపలే పిల్ల మరణించింది. అప్పటి నుంచి 'మే' గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్లు జూ అధికారులు తెలిపారు. ఈ సమస్య మరింత విషమించి.. మూడు నెలలుగా ఆహారం కూడా సరిగా తీసుకోకపోవడంతో నీరసించిపోయింది. బుధవారం తెల్లవారుజామున ప్రాణాలు విడిచింది. దీంతో ఈ జాతి జంతువుల సంతతి పెరిగే అవకాశం లేకుండాపోయింది. మరోవైపు మగ జిరాఫీ ఎన్‌క్లోజర్‌లో ఒంటరిగా మిగిలిపోయింది. సాధారణంగా జిరాఫీలు 20 నుంచి 25 ఏళ్లు జీవిస్తాయి. జూలో మంచి వైద్యం, ఆహారం క్రమం తప్పకుండా అందిస్తారు కాబట్టి.. వాటి జీవిత కాలం మరింత పెరుగుతుంది. కానీ ఇక్కడ జిరాఫీ 10 ఏళ్లకే మృత్యువాత పడటం.. జూ అధికారులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు.


బుధవారం మృతి చెందిన ఆడ జిరాఫీ(ఫైల్)

తిండి తినక.. నీరసించి..

ఇక్కడ రాణి అనే జీబ్రా రెండు నెలల కిందట మృతి చెందింది. నాలుగేళ్లకు ముందు ఇక్కడ జూలో జీబ్రాలు లేవు. 2019 నవంబరులో అప్పటి జూ క్యూరేటర్ యశోదబాయి ఓ జత జీబ్రాలను కోల్‌కతాలోని అలిపూర్ జూ పార్కు నుంచి జంతు మార్పిడి పద్ధతిలో ఇక్కడకు తీసుకొచ్చారు. వాటికి బదులుగా ఇక్కడ నుంచి ఐదు అడవి కుక్కల(రేచు కుక్కలు)ను పంపించారు. అప్పటి నుంచి జీబ్రాలు సందర్శకులను అలరిస్తూ వచ్చాయి. వాటిలో మగ జీబ్రాకు రాజు, ఆడ జీబ్రాకు రాణి అని పేర్లు పెట్టారు. ఏడేళ్ల వయసు ఉన్న ఆడ జీబ్రా రాణి కొంత కాలం కిందట అనార్యోగానికి గురైంది. ఆహారం తినకుండా ఇసుక, మట్టి తినడం వల్ల బాగా నీరసించిపోయింది. సాధారణంగా ఆరోగ్యం బాగాలేనప్పుడు ఇసుక, మట్టి తినడం జీబ్రాల లక్షణం. జూ పార్కుల్లో ఉండే జీబ్రాలు ఇసుక, మట్టి తినేటప్పుడు వాటి ఆరోగ్యం బాగా లేదని అధికారులు, జూ వైద్యులు గమనించి.. వాటికి అవసరమైన వైద్యం అందిస్తుంటారు. కానీ ఇక్కడ వైద్యులు జీబ్రా ఇసుక తింటున్న విషయం పసిగట్టలేకపోయారు. దీంతో అనారోగ్యానికి గురైన ఆడ జీబ్రా ఈ ఏడాది మార్చి 12న మృతి చెందింది. జీబ్రాకు పోస్టుమార్టం నిర్వహించినప్పుడు దాని పొట్ట నుంచి 16 కిలోల ఇసుక బయటపడటం అధికారులను విస్మయానికి గురిచేసింది. రాణి మృతి చెందినప్పటి నుంచి రాజులో హుషారు తగ్గిపోయింది.


మార్చి 12న మృతి చెందిన ఆడ జీబ్రా(ఫైల్)

అనారోగ్యంతో...


ఈనెల 8న మృతి చెందిన తెల్ల పులి(ఫైల్)

తెల్ల పులి కుమారి(19) ఈ నెల 8న మృతి చెందింది. 2007 కంటే ముందు ఇందిరాగాంధీ జూ పార్కులో తెల్ల పులులు లేవు. అప్పటి జూ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కు నుంచి ఓ జత తెల్ల పులులను ఇక్కడకు తీసుకొచ్చారు. వాటిలో కుమారి అనే ఆడ తెల్ల పులి మూడు సార్లు గర్భం దాల్చి 9 కూనలకు(పిల్లలు) జన్మనిచ్చింది. దీంతో జూలో వాటి సంతతి పెరిగింది. వాటిలో కొన్నింటిని జంతు మార్పిడి పద్ధతి ద్వారా ఇతర జూ పార్కులకు తరలించి.. అక్కడ నుంచి కొన్ని జంతువులను ఇక్కడకు తీసుకొచ్చారు. కాన్పూర్ జూకు రెండు తెల్ల పులులను ఇచ్చి.. అక్కడ నుంచి ఒక మగ ఖడ్గ మృగాన్ని ఇక్కడకు తీసుకొచ్చారు. 19 ఏళ్ల వయసుగల కుమారి వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ నెల 8న మృతి చెందింది. ప్రస్తుతం జూలో ఐదు తెల్ల పులులున్నాయి.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



జూలోని జంతువులు, పక్షులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. కొన్ని జంతువులు అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నాయి. జిరాఫీ మెట్రిటిస్, నిమోనియాతో కొన్నాళ్లుగా బాధపడుతోంది. అందుకు తగిన వైద్యం అందించినప్పటికీ మరణించింది. తెల్ల పులి వృద్ధాప్యంతో మృతి చెందింది. జీబ్రా తక్కువ వయసులోనే మరణించడం బాధాకరం. మరింత మంచి వైద్యం అందించి వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఒంటరైన జంతువుల తోడు కోసం.. ఇతర జూ పార్కుల నుంచి ఆయా జంతువులను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– నందనీ సలారియా, జూ క్యూరేటర్

విద్యా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందే..

తగరపువలస: కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉషారాణితో కలిసి భీమిలి మండలం తాళ్లవలసలోని తిరుమల, సంగివలస శశి విద్యా సంస్థలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాలలు, వసతి సముదాయాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను నోటీసు బోర్డులో పొందుపరచాలని, ఫీజుల విషయంలో పిల్లలతో చర్చించవద్దని తెలిపారు. మానసిక నిపుణులను విధిగా నియమించి కౌన్సెలింగ్ చేయాలన్నారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహించొద్దన్నారు. ఫీజులు, పరీక్షలు, సెలవుల విషయంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. క్యాంపస్‌లో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి విషయాలు రాబట్టారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్లు కె.ఎస్.ఎన్.మూర్తి, ఎం.సత్యనారాయణ, మృత్యుంజయరావు, శశి విద్యాసంస్థల ప్రతినిధులు మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఆపద వేళ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. మహారాణిపేటలోని రెడ్‌క్రాస్ భవనంలోని సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరిగింది. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సొసైటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్–19 విజృంభించిన వేళ జిల్లా రెడ్‌క్రాస్ వలంటీర్లు అందించిన సేవలను రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రత్యేకంగా ప్రశంసించారని చెప్పారు. ఈ సేవలకు గుర్తింపుగా.. ఇటీవల తాను జిల్లా తరఫున అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్త మార్పిడి చేసి మందులతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్ శివనాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ నాయకత్వంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కోవిడ్ విపత్తు సమయంలో విశిష్ట సేవలందించిన విష్ణువర్ధన్ రెడ్డి, కనక లింగేశ్వరరావు, రెహమతుల్లా, లక్ష్మీకాంతం, లాక్‌డౌన్ నుంచి ఇప్పటి వరకు పేదవారికి ఉచిత ఆహార పంపిణీ చేస్తున్న ధన్విత ఫౌండేషన్ ప్రతినిధులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. విశాఖ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు జి.జ్యోతి, జాతీయ స్థాయిలో బెస్ట్ యూత్ అవార్డు అందుకున్న ఎస్.సుభాష్‌ను ప్రశంసించారు. సొసైటీ కార్యదర్శి పి.రవికుమార్, పీఆర్వో రావు, సమాచార శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, వలంటీర్లు పాల్గొన్నారు.


మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్న వారితో కలెక్టర్ మల్లికార్జున, సొసైటీ చైర్మన్ శివనాగేంద్రరెడ్డి

సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరణ

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24'ను బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలను క్యాలెండర్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. డీఆర్‌డీవో ఒ.పూర్ణిమాదేవి, సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సమాచార శాఖ జేడీ మణిరామ్

ఫెడరేషన్ కప్‌లో జ్యోతికి స్వర్ణం

విశాఖ స్పోర్ట్స్: నేషనల్ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన స్ప్రింటర్ జ్యోతి ఎర్రాజీ స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. రాంచీలోని బిర్లా ముండా స్టేడియంలో బుధవారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌ను 12.89 సెకన్లలోనే పూర్తి చేసి విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్స్ క్వాలిఫైయింగ్ రౌండ్‌లోనూ 13.18 సెకన్లలోనే పూర్తి చేసి తుది పోరుకు అర్హత సాధించింది. జాతీయ రికార్డును 12.82 సెకన్లలో పూర్తి చేసి తన పేరునే లిఖించుకున్న జ్యోతి.. మీట్ రికార్డ్‌ను 13.43తో సాధించింది. తమిళనాడుకు చెందిన నిత్యారామ్‌రాజ్ 13.44 సెకన్లలో, జార్ఖండ్‌కు చెందిన సప్న కుమారి 13.58 సెకన్లలో పరుగు పూర్తి చేసి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అత్యుత్తమ అథ్లెటిక్ ప్రతిభతో ఉత్కంఠగా సాగుతున్న ఈ సీనియర్స్ మీట్‌లో విజేతగా నిలవడంతో జ్యోతికి ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌కు మార్గం సుగమమైంది. ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ జూలై 12–16 వరకు బ్యాంకాక్‌లో జరగనుంది.


స్వర్ణం సాధించిన జ్యోతి

యూపీఎస్సీ పరీక్షకు పక్కా ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

విశాఖ విద్య: జిల్లాలో ఈ నెల 28న జరగనున్న యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణపై బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 29 సెంటర్లలో 10,865 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. రెండు జోన్లలో జరుగుతున్న పరీక్షలకు భీమిలి, విశాఖపట్నం ఆర్డీవోలు జోనల్ అధికారులుగా ఉంటారన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. గంట ముందుగా మాత్రమే పరీక్ష కేంద్రం తెరవాలన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు మాత్రమే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించమన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్‌సాహెబ్, భాస్కర్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

20న డీటీపీ పోస్టుకు రాత పరీక్ష

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీటీపీ) ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 20న పరీక్ష నిర్వహించనున్నారు. సత్యం జంక్షన్ సమీపం క్రాంతినగర్ (నక్కవానిపాలెం)లోని శ్రీ శారదా విద్య నిలయం ప్రాంగణంలో కంప్యూటర్ పరీక్ష ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు ఆధార్ కార్డును తీసుకొని ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.

వాతావరణ ప్రభావం విశాఖపై అధికం

- మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. నోవాటెల్‌లో వాతావరణం మార్పుపై బుధవారం జరిగిన వర్క్‌షాప్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతంతో పాటు పారిశ్రామిక నగరం కావడం వల్ల వాతావరణంలో మార్పులు ఉంటాయని తెలిపారు. నగరాన్ని ట్రాన్స్‌ఫర్మేషన్ క్లైమేట్ యాక్షన్ ప్రాజెక్టు(టీ–కాప్)కు ఎంపిక చేశారని, అందుకు యునైటెడ్ నేషనల్ యూనివర్సిటీ(యూఎన్‌యూ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్, ఎనర్జీ అండ్ రీసోర్స్ ఇన్‌స్టిట్యూట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. 2014లో హుద్‌హుద్, 2021లో గులాబ్ వంటి తుఫాన్లను ఎదుర్కొన్నామన్నారు. వర్షపు నీరు భూమిలో ఇంకేలా గుంతలు తవ్వడం, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలనతో పాటు విద్యా, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించేలా చర్యలు చేపడితే కొంత వరకు కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. నగరంలో వాతావరణం మార్పునకు అనేక ప్రాజెక్టులు చేస్తున్నారని, అందులో భాగంగా సోలార్ ఎనర్జీ, ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్, విద్యుత్ వాహనాలు, నీటి ప్రాజెక్టులు చేపట్టామన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ తుఫాన్ల ప్రభావం విశాఖ నగరంపై పడకుండా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎనర్జీ అండ్ రీసోర్స్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ డైరెక్టర్ సంజయ్ సేత్, యునైటెడ్ నేషనల్ యూనివర్సిటీ అసిస్టెంట్ అకడమిక్ అధికారి డాక్టర్ హిమాన్షు శేఖర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ప్రతినిధి శరత్‌బాబు, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న మేయర్, జీవీఎంసీ కమిషనర్

హజ్ యాత్రికులకు సీఎం అండ

సీతంపేట: హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.వి.బాబా అన్నారు. హజ్ యాత్రికులకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఒక్కొక్కరికి రూ.83 వేల భారం పడుతుందని హజ్ కమిటీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించారన్నారు. హజ్ యాత్రకు వెళ్లే 1,814 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.14.51 కోట్లు జమ చేయడం.. ముస్లిం సమాజం పట్ల ఆయనకున్న ప్రేమకు నిదర్శనమన్నారు. విశాఖ జిల్లా నుంచి 102 మంది హజ్ యాత్రకు వెళ్తున్నారని, ప్రతి ఒక్కరికీ రూ.80 వేలు చొప్పున ఖాతాల్లో జమ చేసి ముస్లిం పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని బాబా కొనియాడారు.


కె.వి.బాబా